క్లుప్తంగా

ట్రాక్టర్‌ను సొంత పనులకు వాడుకుంటున్న సర్పంచ్

పలిమెల: మండలంలోని పంకెన గ్రామ సర్పంచ్ జీపీకి చెందిన ట్రాక్టర్‌ను తన సొంత పనులకు వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే గ్రామపంచాయతీ సిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం గ్రామంలోని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి సర్పంచ్‌పై చర్య తీసుకోవాలని కోరారు.

ఆలయానికి భూమి అప్పగింత

భూపాలపల్లి రూరల్ : మండలంలోని గొర్లవీడులో మల్లికార్జునస్వామి ఆలయం వెడల్పు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన కొటం సంజీవయ్య రూ. 77,200లతో గుంట భూమిని కొనుగోలు చేసి ఆలయానికి ఇచ్చారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులకు సంజీవయ్య భూమి కొనుగోలు చేసి అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు సంజీవయ్యను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొటం కృష్ణవేణి, రాజబాబు, గ్రామస్తులు స్వామి, రాజయ్య,రవీందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్ బండారో వేడుకలు

ములుగు రూరల్(గోవిందరావుపేట) : బంజారలు సంస్కృతి, సంప్రదాయాల మేరకు సేవాలాల్ మహా రాజ్‌కు భోగ్ బండారో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం గోవిందరావుపేట మండలం పస్రాలో భూక్య సుమలత–సక్రునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా మేరమా యాడికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. కులదైవాలకు భోగ్ బండారో సమర్పించడం జాతి సమైక్యతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మున్నా నాయక్, రాజు నాయక్, సేత్య, బిక్యా, రాములు, సమ్మయ్య, చందర్, అక్షయ్, నవదీప్, భద్రమ్మ, బాజు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప దేవాలయంలో విద్యార్థుల సందడి



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రా మప్ప దేవాలయంలో శనివారం విద్యార్థులు, పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వేలాది సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ పూ జలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ విజయ్ కుమార్, వెంకటేష్‌లు వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి ఫోటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సు కట్టకు చేరుకొని సరస్సులో బోటింగ్ చేస్తూ అందాలను వీక్షించారు.

బాల్య వివాహాలపై అవగాహన

వాజేడు: మండల పరిధిలోని చింతూరులో శనివారం స్థానిక ఎస్సై రేఖ అశోక్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు బాల్యవివాహాలు, బాల కార్మికులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడంతో తలెత్తే సమస్యలు, చట్టపరంగా ఎదుర్కోవాల్సిన ఇబ్బందులను వివరించారు. 14 సంవత్సరాలు నిండకుండా ఎవరినైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. 5 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతీ ఒక్కరిని బడిలో చేర్పించాలని సూ చించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఏటూరునాగారం: జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్ర కారం భోజనం అందించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లోని వంట షెడ్డు, తరగతి గదులు, వంట చేసే విధానాన్ని ఆమె పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి మా నసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్ర భుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి, పేద విద్యార్థులకు గొప్ప విద్య అందజేయాలనే ఉద్దేశ్యంతో ఎన్నో కార్యక్రమాలను ఏర్పాటు చే సి మెరుగైన విద్య అందించాలన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అరుణ

కాటారం: విద్యార్థినులు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శనివారం విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. కిశోర బాలికలకు ఎనీమియా, మిల్లెట్స్, హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. అందుబాటులో ఉండే చిరుధాన్యాలు, కూరగాయలు, ఆహార పదార్థాల్లో అనేక పోషకాలు ఉంటాయని వాటిని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ చల్ల సునీత, అంగన్‌వాడీ టీచర్లు అమ్మక్క, అనసూయ, అమృతారాణి, విమల, శ్యామల, ప్రేమలత, క్రిష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మహాముత్తారం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ రమ్యాబాయ్ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రేమ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషక ఆహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళాసంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్త జాటోత్ చరణ్‌బాయ్, తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: అవగాహన కల్పిస్తూ..

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

టేకుమట్ల: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ టీచర్ స్వప్న అన్నారు. శనివారం మండలంలోని సుబ్బక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను తీసుకోవడంతో వ్యాధుల నుండి త్వరితగతిన కోలుకుంటారని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.



టేకుమట్ల: ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

బాలల హక్కులను రక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్‌కుమార్

భూపాలపల్లి రూరల్: బాలల హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వీసీపీసీల సమర్థ నిర్వహణతోనే బాలల హక్కులను రక్షించవచ్చని స్థానిక ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సమస్యలు సంబంధిత చట్టాలపై గ్రామ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలోని బాలల సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కృషి చేసేలా కార్యదర్శులు చూడాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బడి మానేసిన బాలలు, బాలలపై వేధింపులు, మత్తు పదార్థాలకు బానిసయ్యే బాలలు, పౌష్టికాహార లోపంతో బాధపడే బాలలులేని గ్రామాలుగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దేలా చూడాలని కార్యదర్శులకు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను మండల, జిల్లా కమిటీల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ డీసీపీఓ వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనలో గ్రామ కార్యదర్శులే కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటేష్, డీసీపీయూ సోషల్ వర్కర్ శైలజ, అధికారులు కుమార్, సువర్ణ పాల్గొన్నారు.

బాలుడిని కాటేసిన పాము

మహదేవపూర్: ఆడుకుంటున్న బాలుడి కాలుపై ప్రమాదవశాత్తు పాముకాటు వేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దివ్య–శ్రీనివాసరావు దంపతుల కుమారుడు శ్రీయాన్ అద్వైత్‌తన అమ్మమ్మ ఊరైన అంబట్‌పల్లికి వచ్చాడు. మధ్యాహ్నం వేళలో ఇంటి పెరటిలో ఆడుకుంటుండగా నీరుకట్ట పామును తొక్కగా పాము కాటువేసింది. గమనించిన బాలుడి తల్లి దండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాబుకు ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

టేకుమట్ల(రేగొండ): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మారి స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్టెంట్ పీయూ మేనేజర్ అక్కల రమేష్ అన్నారు. శనివారం రేగొండలోని వాణి విద్యా నికేతన్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డబ్ల్యూ, డబ్ల్యూ, ఎఫ్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని 172 దేశాల్లో నిర్వహిస్తారని, శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 వరకు విద్యుత్ కాంతులను పూర్తిగా నిలిపివేస్తారని, భూగ్రహాన్ని కాపాడే విధంగా ప్రతీ ఒక్కరు సంఘీభావం తెలపాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. మారి సంస్థ ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ శ్రీనివాస్, తిరుపతిగౌడ్, సుజాత, రమాదేవి, మౌనిక, పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

‘ఆదర్శ’లో వార్షికోత్సవం



సైనికుల వేషధారణలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కాటారం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉత్సవ్ –2023 పేరిట శనివారం నిర్వహించిన 33వ వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. విద్యార్థినీ,విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గతంలో ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో నిలిచిన పూర్వ విద్యార్థులను పాఠశాల యజమాన్యం శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాటారం డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కృషి, పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం విద్యార్థులను ఉన్నత స్థానంలో ఉంచుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. వేడుకల్లో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సీఐ రంజిత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ఎస్సై శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృషిత, డైరెక్టర్ కృష్ణచైతన్య, పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

- పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ సమ్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి

కాటారం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, ఎంపీపీ పంతంకాని సమ్మయ్య అన్నారు. పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం ద్వారా రైతులకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సంఘం నిధులు, ఖర్చు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలతో కూడిన నివేదికను సీఈఓ సతీశ్ చదివి వినిపించారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం, పీఏసీఎస్ ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేయాలని తీర్మాణం చేశారు. సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేలా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రుణాల చెల్లింపుల్లో జాప్యం వహించవద్దని సూచించారు. మండలంలో పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామని నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో సీఈఓ సతీశ్, వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, డైరెక్టర్లు చీమల సత్యం, అజయ్, ఐలి రాజబాబు, రాజేశ్వరీ, రాజునాయక్, కృష్ణవేణి, హిమాకర్, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, నాయకులు ఊర వెంకటేశ్వరరావు, దబ్బెట రాజేశ్, డోలి అర్జయ్య, మెట్టు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నారాయణరెడ్డి

కాటారం: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలతో ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు తెలంగాణ వెంకటేశ్వరరావు, నాయకులు చీర్ల బాపురెడ్డి, డోలి అర్జయ్య, దుర్గం మల్లయ్య, ఆశయ్య, రాజేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



ములుగు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పలితాలను సాధించాలని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చుంచు రమేష్ అన్నారు. మండలంలోని దేవగిరిపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందించారు. ఈ మేరకు ములుగు, నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించిన లయన్స్‌క్లబ్ వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ముక్కు సుబ్బారెడ్డి, మేరుగు రమేష్, కొండి సాంబశివ, సానికొమ్ము రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనర్హత వేటును ఉపసంహరించుకోవాలి

మల్హర్: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటును కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వ దోపిడీని, వైఫల్యాలను ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై బీజేపీ అనర్హత వేటువేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, నాయకపోడు సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గాద గట్టయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వల్లెకుంటలో వైద్యశిబిరం ఏర్పాటు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ రాజు

మల్హర్: తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వల్లెకుంటలో వైద్య సిబ్బంది శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి రాజు 118 రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అలాగే జ్వరపీడితల నుంచి రక్తనమునాలు సేకకరించి, ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్లు హేమ్‌సింగ్, సదర్‌లాల్, ఏఎన్‌ఎంలు ఇస్తార్, సూజాత, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

భూపాలపల్లి రూరల్: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికి చేరవేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ బీసీమోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. శనివారం బీఎంఎస్ కార్యాలయంల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓబీసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 6 నుంచి గ్రామ గ్రామాన ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై అవలంభిస్తున్న మోసపూరితమైన విధానాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకులు మహేష్, కంబాల రాజయ్య, చెక్క శంకర్, సూర మైపాల్, మోరే సుధాకర్, గంపల మల్లయ్య, బట్టు రవి, గీత సంపత్ ,జాడి గట్టయ్య, బిరుదు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు కాంగ్రెస్ నాయకుల తరలింపు

కాటారం : రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పర్యటన నేపథ్యంలో చిట్యాల మండలంలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హోంమంత్రిని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అడ్డుకొని ఎలాంటి ఆటంక చర్యలకు పాల్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల అరెస్ట్ అప్రజాస్వామ్యకం అని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎంపీపీతో పాటు కాంగ్రెస్ నాయకులు కుంభం రమేశ్‌రెడ్డి, గడ్డం కొంరయ్య తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ నాయకులకు మద్దతు తెలుపుతున్న ఎంపీపీ, మండల అధ్యక్షుడు

గ్రామపంచాయతీ సిబ్బందికి సన్మానం

టేకుమట్ల(రేగొండ): జాతీయ స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీలను ఇటీవల ఎంపిక చేయగా రేగొండ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి చైల్డ్ ఫ్రెండ్లీ జీపీ విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం జిల్లా కేంద్రంలో సర్పంచ్ చిగురుమామిడి రజిత, పంచాయతీ కార్యదర్శి స్వప్నలను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ భవేష్‌మిశ్రా శాలువాలతో ఘనంగా సన్మానించి, ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును అందించారు కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి,, అదనపు కలెక్టర్ దివాకర, డీపీఓ ఆశాలత, డీఆర్‌డీఓ పురుషోత్తం, డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ గడ్డం రాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.



సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్.

విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చిట్యాల: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. శనివారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లతో పాటు రాగి లడ్డు లను అందజేశారు. అనంతరం డాక్టర్ సునీత మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా న్యూట్రిషన్ కిట్లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత, ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న డాక్టర్ సునీత

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తాడ్వాయి క్లస్టర్ పాక భాస్కర్, సునంద అన్నారు. రిజర్వ్ బ్యాంకు వారి సౌజన్యంతో విడ్స్ సంస్థ ద్వారా శనివారం మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్‌నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాంకు ద్వారా అందించే కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు, బ్యాంకు సేవలు, పొదుపులు, సులభతరమైన డిజిటల్ లావాదేవిల విధానాలు, ఏటీఎం కార్డు ఉపయోగం, వివిధ రకాల విద్యా, వ్యాపార రుణాలు, సబ్సిడీ రుణాలపై వివరించారు. బ్యాంకులో సిబిల్ స్కోర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న లబ్ధిదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.